
# అస్వతంత్ర

క్రేన్ కథల పోటీలో
కన్సొలేషన్ బహుమతి
పొందిన కథ

-మద్దెర్ల రమేశ్.



**"దేవీ!**... నీకే చెప్పేది. త్వరగా రెడీ అవ్వు...."

"సరే"

'ఏంటి సరే? పొద్దుట్నుండి చూస్తున్నాను ఏం చెప్పినా 'సరె' అంటున్నావు నీ పని నువ్వు చేసుకుంటున్నావు"

"మరేం చెయ్యమంటారండీ... నా పని నేను చేసుకోకుంటే మరెవ్వరు చేస్తారు?"

"ఈ పని రోజూ ఉండేదే కదా.... నేను చెబుతున్నదేమిటి? నువు చేస్తున్నదేమిటి?"

"అదే చేస్తున్నాను కదండీ...."

"ఏం చేస్తున్నావ్...? రోజూ వుండే నీ ఇంటి పని నువ్వు చేసుకుంటున్నావ్"

"అన్నీ చెయ్యవలసిన పనులే కదండీ చేస్తున్నాను?"

"ఈ పనులన్నీ చేసుకుంటూ కూర్చుంటే అక్కడ ట్రైన్ మన కోసమాగుతుందా?"

"ఆగుతేనే వెళదాం లెండీ..."

"అదిగో... ఆ నిర్లక్ష్యం చూడు. నిన్నటి నుండి అదే గమనిస్తున్నాను. ఏపని చెప్పినా 'సరే' అంటున్నావ్. అన్నింటికీ ముక్తసరిగా సమాధానం చెబుతున్నావ్... అసలు నీకు మా వాళ్ళంటే ఇష్టం లేదు. ఎప్పుడూ వాళ్ళంటేనే నిర్లక్ష్యంగా మాట్లాడతావ్. నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తావ్...."

"మీ వాళ్ళ విషయంలో నా లక్ష్యంతో పనేమిటండీ...? మీరు తల పెట్టిన ఏ పని జరక్కుండా పోయిందని?, ఈ రోజు నా లక్ష్యం నిర్లక్ష్యం గురించి మాట్లాడుతున్నారు?"

"అదిగో చూడు మళ్ళీ "మీవాళ్ళు' అంటూ వేరు చేసి మాట్లాడుతున్నావు"

"మీరే కదండీ 'మావాళ్ళు' అంటూ నన్ను వేరుగా చేసి మాట్లాడారు?"

"నేనేమీ నిన్ను వేరు చేసి మాట్లాడలేదు"

"ఇప్పుడేకదండీ నాతో 'మావాళ్ళు' అని అన్నారు? అలాంటప్పుడు నేను 'మీ వాళ్ళ'లో ఒకర్ని ఎలాగవుతాను?" "నేనేమీ ఆ ఉద్దేశంతో అనలేదు"

"ఎవరి ఉద్దేశాలనైనా మాటలు, చేష్టల వల్లనే కదండీ ఎవరైనా అర్థం చేసుకోగలిగేది?"

'అంటే నేను నిన్ను వేరుగా చూస్తున్నాననా నీ ఉద్దేశం?"

"మీరు నన్నెందుకు వేరుగా చూస్తారండీ....?"

"మరెవ్వరి... ఓ ... అదా నీ ఉద్దేశం! మీ వాళ్ళొచ్చినప్పుడు ఏం తక్కువ చేశానని ఇంత సాధిస్తున్నావ్?"

"ఇప్పుడు నేనేం సాధిస్తున్నా నండీ...?"

"ఏదో మనసులో పెట్టుకొనే కదా,

నిన్నటినుండి పెడసరంగా మాట్లాడుతున్నావు?"

"అవును. ఏవేవో పనికి రానివన్నీ మనసులో పెట్టుకొని మిమ్మల్ని సాధిస్తున్నాను. మా అన్నయ్యకు చాతిలో నొప్పి వచ్చి హాస్పిటల్లో ఉన్నాడని నిన్న ఉదయం ఫోన్ వచ్చిందని మీకు చెబితే, వచ్చే శనివారం రెండో శనివారం కదా అప్పుడు వెళదామని మీరంటే గమ్మున ఊరుకున్నానే అది నాకు పనికి రాని విషయమే. నిన్న సాయంత్రం ఫోన్లో మీ మేనత్త'మా మ్యారేజీ డే ఫంక్షన్ చేసుకుంటున్నాం రండి' అనగానే 'ఉదయం త్వరగా రెడీ అయి ఉండు' అని మీరు చెప్పిన మాట మాత్రం నేనెంతో సంతషంగా స్వీకరించవలసిన విషయం. మీరు తొందర పెట్టినంత తొందరగా నేను రెడీ అయి మీ ముందు నిల్చుంటే నేను మంచిదాన్ని. లేకుంటే మిమ్మల్ని సాధింపులతో వేధించే గయ్యాళిని...."

"ఆ మాట నేనన్నానా? అయినా ఇప్పుడేమయిందనీ.... అంతగా ఆవేశపడుతున్నావు? మీ అన్నయ్యకు అంత సీరియస్గా ఏమీ లేదు కద! వచ్చేవారం చూసిరావచ్చు. మ్యారేజి డే ఫంక్షన్ ఈ రోజు కాకుండా మరొక రోజు చేసుకుంటారా వాళ్ళు?".

"అవునండీ మీరు మగాళ్ళు కదా! మీరు మాట్లాడే ఏ మాటలైనా తర్కబద్ధంగా వుండి నప్పుతాయి. మేమేమాట మాట్లాడినా తప్పవు తాయి. అంతే. మీరన్నమాటనే 'మీవాళ్ళు' అని నేనంటే ఎంతో దూరం చేసి మాట్లాడిన దాన్నయినాను.కానీ, నా తోడబుట్టిన అన్నయ్య చాతి నొప్పితో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని ఫోనొచ్చిందని చెబితే "వట్టి చాతి నొప్పేకదా, తగ్గిపోతుందిలే. అదేమయినా గుండె నొప్పా?' అని అంత ఈసీగా తీసిపడేసిన మీరు మాత్రం, నన్నూ నా పుట్టింటివారినీ ఎంత దగ్గరి వారిగానో భావించారనుకోవాలి...".

"అబ్బబ్బ....అసలు నీ గొడవేంది? నువ్వొస్తావా? రావా?"

"అవునండీ మీరు మగాళ్ళు కదా! నేనొచ్చినా రాకపోయినా మీరు వెళ్ళగలరు. మీకా స్వాతంత్ర్యముంది. మాదేముంది? మీతో సమానంగా ఉద్యోగాలు చేస్తూ వున్నా, మీతో సమానంగా డబ్బు సంపాదించగలిగినా భార్యలుగా మీ చెప్పుచేతుల్లో ఉన్నంతవరకే కదా మాకు గౌరవం? మిమ్మల్ని కాదని మేమేం చేయగలం? ఇంటి వ్యవహారాన్ని కూడా మాకు మేముగా స్వతంత్రించి ఏదీ నిర్ణయం తీసుకోలేని మేము మీ చెప్పుచేతుల్లో కీలు బొమ్మలమే తప్ప ఏమీ కాలేము.... ఇప్పుడు నేను మీతో రాకపోయినా అక్కడ మీ మర్యాదలకేమీ లోపం రాదు. మీ వాళ్ళందరూ ఆడి పోసుకునేది మాత్రం నన్నేకదా! వాళ్ళ నోళ్ళలో పడకుండా ఉండడం కోసమైనా, అటు మీ వెంట రావలసిందే కాని, ఇటు నా అన్నయ్యను చూడడానికి మాత్రం వెళ్ళలేను. అలా వెళితే మిమ్మల్ని ధిక్కరించి వెళ్ళిన ఆడదాన్నవుతాను. అంతే కదా....?"

> "ఆరోజు ఉదయమే మీ వాళ్ళు కూడా పోతామన్నారు. వాళ్ళనలా పొమ్మని తలూవ లేదెందుకు? ఒక్కొక్కరిని బ్రతిమాలి మరీ ఉండమన్నారు. ఆ పూట వంటలన్నీ కూడా మావాళ్ళే నాతో పాటు ఉండి తయారుచేసారు. కనీసం వాళ్ళు తిన్నారో లేదో కూడా తెలుసుకోకుండానే, పోతామని అనగానే పొమ్మని తలూపారు. అదేనండీ మీ వాళ్ళకూ మా వాళ్ళకూ ఉండే తేడా".

''ఎందుకంతంత పెద్ద డైలాగులు కొడుతున్నావు?"

"డైలాగులు కొట్టడమేముందండీ?"

"మరెందుకలా మాట్లాడుతున్నావు?"

"మీ వెంట నేనుండాల్సిందీ, మీ గౌరవం కోసమే కదండీ?"

''అంటే నీ గౌరవానికి ఏం తక్కువయింది?"

''నాకేం తక్కువండీ? మీ మాట జవదాటనంత వరకూ గుడిలో అమ్మవారికున్నంత గౌరవాదరాలు దక్కుతాయి నాకు"

"నా మాట జవదాటకుండా ఉంటే నీకొచ్చిన బాధేమిటో మరి?"

"మీ వారికి దక్కుతున్న గౌరవ మర్యాదల్లో ఏ కొంతయినా నా పుట్టింటికి దక్కితే ఎంతో సంతోషించేదాన్ని"

"నీ పుట్టింటి వాళ్ళ గౌరవ మర్యాదలకేం తక్కువయిందిప్పుడు?"

"మీ దాకా ఎందుకు లెండి... ఒక అమ్మాయిని, ఇచ్చుకున్న వాళ్ళకు, పుచ్చుకున్నవాళ్ళ ద్వారా గౌరవ మర్యాదలను పొందే అర్హత ఈ సమాజమే ఇవ్వలేదు".

"ఎందుకలా అంటున్నావు?"

''ఇచ్చుకున్నవాడు ఈగ, పుచ్చుకున్నవాడు పులి. ఎక్కడయినా ఈగకు పులి గౌరవ మర్యాదలనిస్తుందా? ఈగను గౌరవిస్తే పులికెంత అవమానం!"

"మీ వాళ్ళను ఈగల్లాగా ఎప్పుడు చూసాను?"

"పులి కంటికి ఈగ అసలు కనబడుతుందటండీ?"

"మీ వాళ్ళు నా కంటికే కనబడనట్టు చేస్తున్నాననటావా?"

"కనబడినంత కాలం కనబడతారు. ఇప్పుడెందుకు కనబడతారు?"

"అంటే?"

''మీకవనరమున్నంతకాలం కనబడతారు. ఆ తర్వాత..."

"ఆ తర్వాత కనబడరంటావు... అంతేనా?"

"..............."

"మీ వాళ్ళతో నాకేమవసరముందని ఒకప్పుడు కనబడ్డారు? ఏమవసరం తీరిందని ఇప్పుడు నాకు కనబడట్లేదు? చెప్పు.......... మీ వాళ్ళతో నేను తీర్చుకున్న అవసరమేమిటి?"

"...................."

"మాట్లాడవేమిటి? చెప్పు......."

"నా నోటితో చెప్పించటమేమిటి? మీకు తెలీదా?"

"నువ్వు చెప్పితేనే కదా తెలిసేది?"

"నేను చెప్పితేనే వాళ్ళ చుట్టూ తిరిగి, ఉన్న ఇంటి జాగా కాస్తా అమ్మించి డబ్బులు వసూలు

చేసుకొచ్చారా?"

"వాళ్ళిస్తామన్న కట్నం డబ్బులిచ్చారు. దానికి నా అవసరమేమిటి? 'నేను' వాళ్ళ చుట్టూ తిరగడమేమిటి?"

"మా వాళ్ళిస్తామన్న కట్నం డబ్బులు ఇచ్చేంతవరకూ వాళ్లింటికి పండుగా పబ్బాలతో పనిలేకుండా తిరిగాము. ఆ బాకీ కాస్తా తీరాక వాళ్ళతో మనకు ఇంకా అవసరమేముంది? ఆ మనుషులు ఎదురుగా వచ్చినా మనకంటికి కనపడాలనేముంది?"

"అసలేమనుకుంటున్నావ్ నన్ను? నన్నొక స్వార్థపరుడిలాగా చిత్రించాలనుకుంటున్నావా? నేనోదో బలవంతంగా మీ దగ్గర నుంచి కట్నం వసూలు చేసినట్టు చేస్తున్నావు. మీ వాళ్ళే నన్నెంతో బ్రతిమాలి, కాళ్ళా వేళ్ళాపడితే నిన్ను చేసుకోవడానికి ఒప్పుకున్నాను".

"అవును వాళ్ళు కాళ్ళూ వేళ్ళూ పట్టుకుంటే తప్ప మీకు పెళ్ళి చేసుకోవాల్సిన అవసరంలేదు. ఈ లోకంలో ఆడదానికొక దానికే పెళ్ళి అవసరం. మగవాడికి పెళ్ళి అనేది లేక పోయినా జీవితంలో అన్నీ పొందగలడు. అంతే నంటారు కదండీ....?"

"ఎందుకలా అంటున్నావు? మగవాడికి పెళ్ళిజరగకుండా జీవితమెలా అనబడుతుంది?"

"ఎందుకనబడదు? ఎలాగ గడిచినా జీవితం జీవితమే అవుతుంది"

"అయితే నేను ఒంటరి జీవితం గడప వలసిన వాడినంటావా? నాకా ఖర్మేం పట్టింది? నువ్వు కాకపోతే మరొకర్ని చేసుకొనేవాడిని".

"మరొకరైనా ఆడపిల్లే కావాలి కదండీ? మళ్ళీ ఆ ఆడపిల్ల తల్లిదండ్రైనా మిమ్మల్ని బ్రతిమాలి, మీ కాళ్ళూ వేళ్ళూ పట్టుకొని మీకు కట్టబెట్టాల్సిందే కదా!"

"అడిగిన కాడికి ఇచ్చేస్తే బ్రతిమాలాల్సిన పనేముంది?"

"అక్కడే వచ్చిందండీ సమస్య! అసలు అడగడమే తప్పని మీకు తెలియక పోవడం అటుంచి, వాళ్ళు బ్రతిమాలకుండా ఇవ్వ గలిగేంత మీరు అడిగితే కద, వాళ్ళు ఇవ్వ గలిగేది! అలా మీరడిగితే మీ గొప్పతన మేముంటుంది? వాళ్ళు మిమ్మల్ని కొనుక్కున్న ట్టుగా అన్పించదూ? అందుకే, వాళ్ళకున్న దంతా ఊడ్చి మీ చేతుల్లో పెట్టి, ఇక మాశక్తి గింతే అని మిమ్మల్ని బ్రతిమాలితేనే కదా వాళ్ళు ఎప్పటికీ మీ కింది మనుషుల్లాగా ఉండేది. రాబోయే కాలం అంతా మీ ముందు చేతులు కట్టుకొని, వినయంగా వుండడానికి తగిన బ్యాగ్రౌండ్ నిర్మించుకొనేదికూడా అక్కడే కద!"

''అంటే, మీ వాళ్ళను నేనెప్పుడూ గౌర వించలేదంటావ్"

"నేననడ మేమిటి? మా వాళ్ళపై సర్వాధి కారాలు చలాయిస్తున్న మీకు తెలియనట్టు!"

"సర్వాధికారాలా? అవేమిటి?"

"అవును. అవి హక్కుగా అనుభ విస్తున్న మీకెలా అర్థమవుతాయి?"

"అర్థమయ్యేలా నువ్వే చెప్పుమరి".

"నాతో చెప్పించుకోవడమే మీకు కావలిస్తే చెబుతాను వినండి. మా ఇంటికి వచ్చినప్పుడు ఏనాడైనా మీకు ఏ లోటైనా కలిగిందా? కలిగిందాని మిమ్మల్నడిగితే మీరేం చెబుతారు? మీకంతా లోటుగానే అన్పించి ఉండొచ్చు. అది మా స్థోమత అని మీరర్థం చేసుకొని ఉంటారని మాత్రం నేననుకోను. మా స్థితి గతులను గురించి ప్రక్కనపెట్టి, మా ఇంట్లో మీ ప్రవర్తన విషయానికొస్తే, ఆడదాన్నై పుట్టినందుకు నన్ను నేను అసహ్యించుకున్న సందర్భాలెన్నో ఉన్నాయి. ఎందుకంటారా? ఆడదాన్నయి పుట్టిన ఖర్మానికి మీ ముందు తలవంచుకొని తాళి కట్టించుకున్నాను. జీవితాంతం మీ ముందు తలవంచుకొని వుండవలసిందే ననే ఉద్దేశంతోనే కాబోలు మన సంప్రదాయం అలా నిర్దేశించింది. నా వరకూ ఓకే. నన్ను కన్న తల్లిదండ్రులకు,తోబుట్టువులైన అన్నదమ్ములకూ అదే ఖర్మమెందుకోసమో నాకర్థం కాదు. మేమందరమూ ఇంట్లో కూర్చొని సరదాగా



మాట్లాడుకుంటున్న సమయంలో బయటి నుండి మీరొచ్చారే అనుకోండి, గౌరవంతో నేను లేచి నిలబడతాను, నాకంటే చిన్నవాళ్ళయిన చెల్లీ తమ్ముడూ లేస్తారు. మా అమ్మానాన్నా అన్నయా ఎందుకోసం నిలబడాలో తెలియదు. పెళ్ళయిన కొత్తలో అభిమానం కొద్దీ అందరం ఎదురుగా వచ్చి నిలబడి మాట్లాడినా, తర్వాత తర్వాత అది మీ ముందు మా అందరి బాధ్యతలా తయారయింది.

ఎప్పుడయినా మా అమ్మా నాన్నలు ఆరోగ్యం సహకరించక లేవకుండా ఉండిపోతే, బయటివాళ్ళతో మా వాళ్ళకు మార్యాద తెలవదని మీరు చెప్పడం నేనెన్నోసార్లు విన్నాను. ఒక్కొక్క సారైతే లోపలికి మీరొచ్చి, మా వాళ్ళు నిలబడకపోతే మళ్ళీ మీరు బయటికి పోయి నిలబడడమూ వాళ్ళు లేచి నిలబడిన తర్వాతగాని మీరు లోనికి వచ్చి కూర్చోవడమూ చూసి మా వాళ్ళ పరిస్థితికి నేనెన్నోసార్లు బాధపడ్డాను.

ఇదెక్కడి పనికిరాని పాడు సాంప్రదాయ మండీ.... ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రులకు ఇదెక్కడి అవమానమండీ.... అమ్మాయిలను కన్నతల్లిదండ్రులను హీనంగా చూడడమూ ఒక సంప్రదాయమేనా? అదీ ఒక సంస్కృతేనా?



ఈ పరిస్థితి ఇలాగే ఇంకా కొనసాగితే అమ్మాయిలను కన్న తల్లిదండ్రులందరూ అల్లుండ్లకు బానిసలుగా తయారయ్యే విషసంస్కృతే దాపురిస్తుంది".

"అంత ఆవేశంగా రొప్పుతూ మాట్లాడుతున్నావెందుకో... ఇప్పుడంత ఆవేశంగా మాట్లాడాల్సినంత అవసరమేమొచ్చిందో....?"

"ఆ విషసంస్కృతి లక్షణాలు ఇప్పటికే మనింట్లో చూసాను కాబట్టే ఇంత ఆవేశం".

''ఏదీ మీ వాళ్ళను బానిసలుగా చూసావా?"

"కూలీ డబ్బు కూడా లేని పనిమనుషులను ఏమంటారు? బానిసలు అని కాక! మొన్నటికి మొన్న, చిన్నిగాడి బర్త్‌డే గ్రాండ్‌గా సెలబ్రేట్ చేద్దామని మనం తీర్మానించుకున్నాక మీ బంధువులందరి ఇంటింటికీ తిరిగి చెప్పుకొని వచ్చారు మీరు. అందరికీ చెప్పుకోవడం పూర్తయిందని మీరు చెబితే మా వాళ్ళను గుర్తు చేసేంత వరకూ మీకు మా వాళ్ళు గుర్తుకురారు. ఎలాగైతేనేం ఫోన్లో నేనే తెలియచెప్పుకొని పిలిపించుకొన్నాను. రావడం వాళ్ళ ధర్మం కాబట్టి వచ్చారు" ఇంకేమిటి? వాళ్ళు వచ్చారు కదా! ఎందరు పనిమనుషులభారం తప్పించారు మీకు! ఆ విధంగా వాళ్ళు మీకు మేలే చేశారు. కానీ, ఏ ఒక్క పూటయినా వాళ్ళ భోజనం గురించి తెలుసుకున్నారా? శుంక్షనంతా అయిపోయి, అన్ని పనులూ పూర్తయినాక మీ అన్నదమ్ముళ్ళతో స్పెషల్ పార్టీలో కూర్చుని ఉన్నారే కాని 'వెళ్ళొస్తాను బాబు' అంటూ చెబుతున్న మా అమ్మా నాన్నల మాటకు, కనీసం నోరైనా తెరవకుండా పొమ్మన్నట్టు తల ఊపారే. అదీ మీరు మా వాళ్ళకు ఇస్తున్న గౌరవం. విలువ".

"పోతామంటున్నవాళ్ళను పొమ్మనక ఏమనాలి?"

"ఆరోజు ఉదయమే మీ వాళ్ళు కూడా పోతామన్నారు. వాళ్ళనలా పొమ్మని తలూపలేదెందుకు? ఒక్కొక్కరిని బ్రతిమాలి మరీ ఉండమన్నారు. ఆ పూట వంటలన్నీ కూడా మావాళ్ళే నాతో పాటు ఉండి తయారుచేసారు. కనీసం వాళ్ళు తిన్నారో లేదో కూడా తెలుసుకోకుండానే, పోతామని అనగానే పొమ్మని తలూపారు. అదేనండీ మీ వాళ్ళకూ మా వాళ్ళకూ ఉండే తేడా".

"అయితే మీ వాళ్ళకూ మా వాళ్ళకూ ఉండే తేడాలు, గౌరవ మర్యాదలూ గురించి వాదించుకుంటూ ఉంటానంటావు కానీ ఇవ్వాళ ప్రయాణానికి మాత్రం కుదరదంటావ్. అంతేనా?"

"ప్రయాణం మాట అటుంచి, ముందుగా మీరు 'మీవాళ్ళు' 'మావాళ్ళు' అనే తేడాలు చూపడం మరిచిపోయి అందరూ 'మనవాళ్ళు' గా సమానంగా చూడటం అలవాటు చేసుకొని నడుచుకుంటే అంతా మంచే జరుగుతుందండీ."

"అంటే నువ్వు నాతో వస్తున్నావన్నమాట!"

"అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను కానీ, ఇప్పుడు మీతో వస్తున్నానని అనలేదు కదా!"

"అంటే?"

"మా ఆడవాళ్ళు మనసులోని గోడు ఎంత వెళ్ళబోసుకున్నా మీ మగాళ్ళ మనసు కెక్కదు కానీ, చెప్పాల్సిందేదో ఇక సూటిగా చెప్పి చేసుకుంటూపోవడమే మాకు తగిన పని".

"అయితే ఏం చెయ్యబోతున్నావు?"

"నా మట్టుకు నేను మా అన్నయ్యను చూడడానికి వెళుతున్నాను"

"అటు వెళ్ళవలసిన ట్రెయిను ఎప్పుడో వెళ్ళిపోయి వుంటుంది!".

"అటు వెళ్ళవలసిన ట్రెయినే కాదు, మీరు వెళదామన్న ట్రెయిను కూడా ఇంకా వెళ్ళలేదు".

"ఎలా చెప్పగలుగుతున్నావు?"

"మొన్నటి నుంచి కురుస్తున్న వర్షాలకు ఎక్కడో 'ట్రాక్' కొట్టుకుపోయిందట. అటు పోయే ట్రెయిను, ఇటు పోయే ట్రెయిను మూడున్నరగంటలు ఆలస్యంగా నడుస్తున్నాయట".

'ఇంట్లో ఉండే అన్నీ తెలుసుకుంటున్నావు. నువ్వే నా కంటే బెటర్'

'అవును. టీ.వీల పుణ్యమాని ఆడవాళ్ళు ఈ రోజుల్లో ప్రపంచాన్నంతటిని గురించి బాగానే తెలుసుకుంటున్నారు. కానీ, కుటుంబ పరంగా తమపై జరుగుతున్న అణచివేతను మాత్రం అర్థం చేసుకోలేక పోతున్నారు. అదే మా దౌర్భాగ్యం".

"నీలాంటి భార్యలే అందరు మగాళ్ళకీ ఉంటే ఇంకెక్కడి దౌర్భాగ్యం? అంతా మహాభాగ్యమే".

"మరిప్పుడు మీ ప్రయాణం ఇటా? అటా?"

"ప్రస్తుతానికి ఇటే...

సాయంత్రం వరకూ వీలైతే అటు".